సాక్షి శ్రీకాకుళం

సోమవారం । 30 । డిసెంబర్ । 2024



యమ'కంకర'లు..!

పీర్లకొండ, సూదికొండ ప్రాంతంలో ఎర్రమట్టి కొండలు తరిగిపోతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరుగుతున్నాయి. - 8లో



పచ్చని మొక్కలపై కక్షెందుకు బాబూ..?

అధికార పార్టీ రాజకీయ కక్ష సాధింపులు కొనసాగుతున్నాయి. వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌కు చెందిన కొబ్బరి మొక్కలను జేసీబీతో తొలగించారు. - 8లో

గ్రామ సచివాలయాల్లో ప్రదర్శించాలి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎస్సీ జనాభా వివరాలపై సోషల్ ఆడిట్ నిర్వహించాలని తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, అయితే ఆ జాబితాలను గ్రామ సచివాలయాల్లో ప్రదర్శించాలనే ఉత్తర్వులు అమలు కాలేదని ఎస్సీ ఆది ఆంధ్ర ఉపకులం జిల్లా కన్వీనర్ వై.చలపతిరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గడువు రెండు రోజుల్లో ముగుస్తున్నప్పటికీ నేటికీ సచివాలయాల్లో ప్రదర్శించకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆలస్యం చేయకుండా ప్రదర్శించాలని కోరారు.

న్యూస్‌రీల్

సదరం సర్టిఫికెట్లకు బ్రేక్

నరసన్నపేట: దివ్యాంగులకు వికలాంగత్వం నిర్ధారించే సదరం సర్టిఫికెట్ల జారీ ప్రక్రియను ప్రభుత్వం నిలిపివేసింది. సెకెండ్రీ హెల్త్ డైరెక్టరేట్ డైరెక్టర్ అట్టాడ సిరి ఈ మేరకు ఆదేశాలు జారీ చేయగా నరసన్నపేటతో పాటు ఇతర ఆస్పత్రులకు శనివారం చేరాయి. ప్రస్తుతం జిల్లాలో రిమ్స్‌తో పాటు నరసన్నపేట, టెక్కలి, పాతపట్నం, రణస్థలం, పలాస, ఆమదాలవలసల్లో సదరం సర్టిఫికెట్లను మంగళ, శుక్రవారాల్లో జారీ చేస్తున్నారు. ముందుగా మీ–సేవా కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకున్న వారికి వైద్యులు పరిశీలించి ధ్రువపత్రాలు అందిస్తున్నారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో దివ్యాంగులు ఆందోళన చెందుతున్నారు.

ఉత్సాహంగా చెస్ పోటీలు



చెస్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా స్థాయి చెస్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. శ్రీకాకుళం నగరంలోని నానుబాలవీధిలో ఉన్న జిల్లా చెస్ శిక్షణా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ఈ పోటీల్లో క్రీడాకారులు ఎత్తుకు పైఎత్తులేసి మేథాసంపత్తికి పదునుపెట్టారు. ఐదు రౌండ్ల పాటు జరిగిన ఈ పోటీల్లో పలాసకు చెందిన కోట కల్పక్ ప్రథమ, చంద్రమౌళి ద్వితీయ, ఎం.లక్ష్మణ్ తృతీయ స్థానాలు సాధించారు. ఆ తర్వాతిస్థానాల్లో చిట్టిబాబు, శివ, బి.అభినవ్ నిలిచారు. విజేతలకు జిల్లా చెస్ సంఘ ప్రతినిధులు ఎస్.భీమారావు, వసంతరావు, అప్పాజీ తదితరులు బహుమతులు అందజేశారు.

మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రచారం

శ్రీకాకుళం: నూతన సంవత్సరం 2025ను ఆనందంగా ఆహ్వానిద్దామని.. మద్యపానం, మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రచారం ద్వారా ప్రజలను చైతన్యవంతం చేద్దామని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని యూటీఎఫ్ భవనంలో జేవీవీ ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కామేశ్వరరావు మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో యురేకా సైన్స్ ఎక్స్‌పో ద్వారా విద్యార్థులతో సృజనాత్మకత ప్రయోగాలు రూపకల్పన చేయించి ఆన్‌లైన్‌లో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో జేవీవీ జిల్లా వ్యవస్థాపక కార్యదర్శి కె.అప్పారావు, పి.గోవిందరావు, తంగి ఎర్రమ్మ, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సూర స్వర్ణకుమారి, పి.ధర్మారావు, సూర్యనారాయణ, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఐక్యత చాటండి.. లక్ష్యాన్ని ఛేదించండి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఐక్యత చాటడం ద్వారా లక్ష్యాన్ని ఛేదించడం సులభతరం అవుతుందని ట్రేడ్ యూనియన్ జేఏసీ నాయకులు, ఎండీయూ ఆపరేటర్స్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు టి.తిరుపతిరావు అన్నారు. ఎండీయూ ఆపరేటర్ల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు రౌతు సూర్యనారాయణ అధ్యక్షతన స్థానిక ఎన్‌జీవో హోంలో ఎండీయూ ఆపరేటర్ల జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ కార్మిక సంఘంగా ఎండీయూ ఆపరేటర్ల సంఘం రూపొందడం అభినందనీయమన్నారు. మారుమూల పల్లెల్లో ప్రజలకు నిరంతరం సేవలందించే ఎండీయూ ఆపరేటర్లకు వేతనాల పెంపుదల, పలు సౌకర్యాల కల్పన చేయాలన్నారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్ మాట్లాడుతూ.. ఎండీయూ ఆపరేటర్ల సంఘం హక్కుల కోసం పోరాడుతూనే బాధ్యతలు విజయవంతంగా నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు జి.హేమంత్, కె.నవీన్, జిల్లా కార్యదర్శి జోర గోపి, సహాయ కార్యదర్శులు ఎల్లవ్వల నాయుడు, డి.వాసు, కోశాధికారి సింహులు, సోషల్ మీడియా ఇన్‌చార్జి బొట రామారావు, ఎచ్చెర్ల, ఆమదాలవలస, నరసన్నపేట, టెక్కలి నియోజకవర్గాల ఇన్చార్జిలు డి.దామోదర్, జి.బాలకృష్ణ, కె.సంతోష్, ఎస్.వెంకటరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు మోహన్, కె.అవ్వల నాయుడు, రామారావు, వేణుగోపాల్, బుజ్జి, గోవిందరాజు, విశ్వనాథం, రవి, మహేష్, నీలకంఠం, కార్తీక్, శ్రీనివాసరావు, ఉమాశంకర్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ట్రేడ్ యూనియన్ జేఏసీ నాయకులతో ఎండీయూ ఆపరేటర్లు

కిరణ విన్యాస కెరటం



సాగర తీరాన, గిరుల నడుమ తూరుపు వెచ్చని రవి కిరణాలు జగతిని హత్తుకుంటూ ఆదివారం ప్రకృతి ప్రేమికులకు కనువిందు చేశాయి. ఇచ్ఛాపురంలోని డొంకూరు సముద్ర తీరం, బెల్లుపడ మినీ కైలాసగిరి ప్రాంతాల్లో ఈ దృశ్యాలు ఆకట్టుకున్నాయి.

- ఇచ్ఛాపురం రూరల్





కోటికాంతుల వెన్నెల

కోటి దీపోత్సవం కన్నుల పండువగా సాగింది. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానం వేదికయింది. విజయదుర్గా ఆలయం ప్రధానార్చకులు ఆరవెల్లి సూర్యనారాయణ శర్మ, విజయగణపతి ఆలయం ప్రధానార్చకులు పెంట శ్రీధర్ శర్మ ఆధ్వర్యంలో మాస శివరాత్రి పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా పసర్లపాటి శ్రీనివాస బంగారయ్యశర్మ దీపాల విశిష్టతపై ప్రసంగించారు. - శ్రీకాకుళం కల్చరల్

నేడు సీఏఎస్ ఇంటర్వ్యూలు



ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో బోధన సిబ్బందికి ఉద్యోగోన్నతులకు సంబంధించిన సీఏఎస్ (కెరియర్ అడ్వాన్స్ స్కీం) ఇంటర్వ్యూలు సోమవారం నిర్వహించనున్నారు. రిజిస్ట్రార్, బయో టెక్నాలజీ ప్రొఫెసర్ పి.సుజాతకు సీనియర్ ప్రొఫెసర్ హోదా, బయోటెక్నాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉదయ్‌భాస్కర్, లోకేశ్వరి, స్వప్నవాహిణిలు, సోషల్ వర్క్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు అనురాధ, కావ్యజ్యోత్స్నలకు అసోసియేట్ ప్రొఫెసర్ల ఉద్యోగోన్నతులకు సంబంధించి ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. సబ్జెక్టు నిపుణులతో కూడిన బోర్డులు ఏర్పాటు చేశారు. ఇంటర్వ్యూలు అనంతరం అర్హత, ప్రభుత్వ నిబంధనలు, పాలక మండలి అనుమతి వంటి అంశాలు ఆధారంగా ఉద్యోగోన్నతులు కల్పిస్తారు. ఇప్పటికే అర్హతల ధ్రువీకరణ పత్రాల స్క్రూటీనీని నిపుణుల కమిటీలు పూర్తిచేశాయి.

తోటపాలెంలో చోరీ

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం నగర పాలక సంస్థ పరిధిలోని తోటపాలెం గ్రామ సమీపంలో ఉపాధ్యాయుడు తలసింత కిశోర్ ఇంట్లో శనివారం చోరీ జరిగింది. ఆరు తులాల బంగారం, రూ.50 వేలు నగదును దొంగలు పట్టుకుపోయారు. భార్యాభర్తలు ప్రభుత్వ ఉపాధ్యాయులు కాగా స్కూల్‌కు వెళ్లి సాయంత్రం ఇంటికి చేరుకునే సరికి వెనుక వైపు తలుపులు తెరచి ఉన్నాయి. లోపలికి వెళ్లి పరిశీలించగా బంగారం, నగదు పోయినట్లు గుర్తించారు. ఆదివారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై వి.సందీప్‌కుమార్ చెప్పారు.



నాడు : మూలపేట పోర్టు పనులు (ఫైల్)

సంక్షేమం నుంచి







కొత్త ఏడాది వస్తోందంటే కోటి ఆశలు ముప్పిరిగొంటాయి. కానీ వెళ్లిపోతున్న ఏడాది ఆ ఆశలను మొగ్గలోనే తుంచేసింది. కొత్త వత్సరాది ఎలా ఉంటుందోనన్న ఆందోళన రేపుతోంది. కారణం.. గడిచిపోతున్న ఏడాది.. అంటే 2024లో సంభవించిన పెను రాజకీయ మార్పులే. ఫలితంగా ఈ ఏడాది తొలి అర్థ భాగంలో పరిఢవిల్లిన సంక్షేమ పాలన నుంచి ప్రజలు.. మలి అర్ధభాగంలో సంక్షోభంలో కూరుకుపోయారు. తప్పుడు ప్రచారాలను నమ్మి జగన్ సర్కారు కంటే ఎక్కువ సంక్షేమ ఫలాలు అందుతాయని ఆశపడి నిలువునా మోసపోయారు. కొసరు సంగతి అటుంచి ఇప్పటికే అందుతున్న అసలు సంక్షేమ పథకాలకు కూడా కూటమి సర్కారు ఎసరు పెట్టేస్తుండటం.. ఇదేంటని ప్రశ్నించేవారిని అరెస్టులు, కేసులతో వేధిస్తుండటం ప్రజానీకాన్ని ఆందోళనకు గురి చేస్తోంది. కొత్త ఏడాదిలోనూ ఈ అరాచక పాలన భరించక తప్పదా..! అన్న భయాందోళనల మధ్య 2025కు అనివార్యంగా స్వాగతం పలికేందుకు సిద్ధం అవుతున్నారు.

- వైఎస్ జగన్ హయాంలోనే సుపరిపాలన
- ఎన్నికల ముందు వరకు సంక్షేమం, అభివృద్ధి, ప్రశాంతత
- జూన్ నుంచి మారిన పరిస్థితులు
- కూటమి ప్రభుత్వంలో దాడులు, కక్షసాధింపులకు పెద్దపీట
- సంక్షేమ పథకాలకు స్వస్తి పలికిన పాలకులు
- 2024లో భిన్నపార్శ్వాలు చూసిన జిల్లా వాసులు



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్నంతవరకు జిల్లాకే తలమానికంగా నిలిచిన మూలపేట పోర్టు పనులు వేగవంతంగా జరిగాయి. బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్ పనులు జోరందుకున్నాయి. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెటర్నరీ క్లినిక్ సెంటర్లు, ప్రభుత్వాసుపత్రులు, పాఠశాలల అభివృద్ధి పనులు చకచకా సాగాయి. రోగులకు అవసరమైన మందులు అవసరానికి తగ్గట్టుగా, గతం కంటే బడ్జెట్ పెంచి మరీ ప్రభుత్వాసుపత్రులకు సరఫరా అయ్యాయి. ఇక, సంక్షేమ పథకాలైన వైఎస్సార్ ఆసరా, విద్యాదీవెన, విద్యా కానుక, వసతి దీవెన, రైతు భరోసా, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, జగనన్న తోడు, జగనన్న ఇళ్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇలా సంక్షేమ పథకాలన్నీ సకాలంలో అమలయ్యేవి. లబ్ధిదారుల ఖాతాలకు ఠంచన్‌గా నిధులు జమయ్యాయి.



సంక్షోభం లోకి..

కూటమి ప్రభుత్వం రాకతో సంక్షేమం ఆగిపోయింది. చివరికీ, ఆసుపత్రులకు మందులు కూడా సరఫరా చేయలేని దుస్థితికి దిగజారిపోయింది. రైతులకు పెట్టుబడి సాయం అందక, విత్తనాలు, ఎరువులు సకాలంలో అవసరం మేరకు సరఫరా కాక, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఆరు నెలల్లో పరిస్థితులు ఎంత మారిపోయాయోనని ప్రజలు బాధపడుతున్న పరిస్థితికి వచ్చేసింది.



భూ ఆక్రమణలు..



అధికారంలోకి వచ్చిన వెంటనే టీడీపీ నేతలు భూ ఆక్రమణలకు తెగబడ్డారు. జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున తమ్ముళ్లు భూ ఆక్రమణలకు పాల్పడారు. చివరికి, ప్రభుత్వ కార్యాలయాల భూములను సైతం వదల్లేదు. ఎచ్చెర్ల గురుకులం భూముల్ని దర్జాగా కబ్జా చేసేశారు.

కక్ష సాధింపులు.. వేధింపులు



కూటమి ప్రభుత్వం వచ్చాక కక్ష సాధింపులో భాగంగా చిరుద్యోగుల్ని పెద్ద ఎత్తున తొలగించారు. విద్యాశాఖ పరిధిలోని మధ్యాహ్న భోజనం ఏజెన్సీ నిర్వాహకులు, స్వీపర్లను, వివిధ శాఖల్లోని ఔట్ సోర్సింగ్, తాత్కాలిక ఉద్యోగులతో పాటు ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు, రేషన్ డిపో డీలర్లు, అంబేడ్కర్ యూనివర్సిటీలో పనిచేసిన తాత్కాలిక ఉద్యోగులు, వలంటీర్లను తీసేశారు. ఎన్నికల్లో అనుకూలంగా వ్యవహరించలేదని వేలాది మందికి చెందిన సామాజిక పింఛన్లు తీసేశారు. రైతులకు ఇవ్వాల్సిన విత్తనాలు, ఎరువుల్లోనూ రాజకీయం చేశారు. టీడీపీకి అనుకూలంగా ఉన్న వారికే ఎక్కువగా ఇచ్చారు.



ఇసుక దోపిడీ..



ఉచిత ఇసుక విధానమంటూ తెలుగు తమ్ముళ్లు సామాన్యులకు ఇసుకను దూరం చేసేశారు. శ్రీకాకుళం, ఆమదాలవలస, పాతపట్నం, నరసన్నపేట, ఎచ్చెర్ల, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో ఎక్కడికక్కడ అనధికారికంగా రీచ్‌లను నిర్వహించి, లారీకి రూ.40వేలు చొప్పున అడ్డగోలుగా వసూలు చేసి, వందల కోట్ల రూపాయలను అక్రమంగా సంపాదించుకున్నారు. రాత్రీపగలు తేడా లేకుండా యంత్రాలతో తవ్వకాలు చేసి, నదులను గుల్ల చేసేశారు. ఇసుక బాగోతాన్ని జిల్లా ప్రజలంతా కళ్లారా చూశారు.



మద్యం షాపులపై గుత్తాధిపత్యం



చంద్రబాబు ప్రవేశపెట్టిన లిక్కర్ పాలసీని టీడీపీ నాయకులు తమకు అనుకూలంగా మార్చుకుని, మద్యం వ్యాపారంపై గుత్తాధిపత్యం సాధించారు. ఔత్సాహిక వ్యాపారులను భయపెట్టి కొందర్ని టెండర్లలో పాల్గొనకుండా చేశారు. మరి కొందర్ని లాటరీలో షాపులు దక్కించుకున్నా బెదిరించి గుప్పెట్లోకి తెచ్చుకున్నారు. మరికొన్నిచోట్ల షాపుల నుంచి నెలవారీ ముడుపులకు ఒప్పందం చేసుకున్నారు. అత్యధిక షాపులు కింజరాపు కుటుంబీకులు, నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తదితరులు దక్కించుకుని మద్యంలో తమదే ఆధిపత్యమని నిరూపించుకున్నారు.





లైంగిక వేధింపులు..

- జూన్ 14న ఎచ్చెర్ల మండలం తోటపాలెంలో తల్లి వద్ద ఉన్న బాలికను తల్లి ప్రియుడు లైంగిక వేధింపులకు గురి చేశాడు. దీనిపై బాలిక, బాలిక తండ్రి ఎచ్చెర్లలో ఫిర్యాదు చేయడంతో పోక్సో కేసు నమోదైంది.
- జూన్ 23న ఎచ్చెర్ల మండలం పొన్నాడకు చెందిన 15 ఏళ్ల బాలిక ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించింది. నిందితునిపై పోక్సో కేసు నమోదు చేశారు.
- ఆమదాలవలసకు చెందిన ఓ మహిళా కానిస్టేబుల్ తనపై ఎస్ఐ లైంగిక వేధింపులకు పాల్పడ్డారంటూ ఎస్పీకి ఫోన్‌లో ఫిర్యాదు చేశారు.
- కాశీబుగ్గ కేంద్రంగా ఇద్దరు బాలికలపై ఇద్దరు యువకులు లైంగిక దాడికి పాల్పడమే కాకుండా మరో యువకుడు వీడియోలు తీయడం సంచలనమైంది.

దౌర్జన్యాలు..



- నగరంలోని ఒక పెట్రోల్ బంకు వద్ద పార్కు చేసిన వాహనాన్ని తీయాలని అడిగినందుకు సిబ్బందిపై కొందరు వ్యక్తులు దాడి చేసి రౌడీయిజం చూపించారు.
- నగరంలోని ఆనందమయి ఫంక్షన్ హాల్‌లో తాగి అల్లరి చేయవద్దని సంబంధిత యజమాని కుటుంబ సభ్యుడు అడిగినందుకు టీడీపీకి చెందిన వారు చితకబాదారు.
- అక్టోబరు 16న బలగమెట్టు వద్ద వందల మంది జనాలు చూస్తుండగా సనపల సురేష్ అనే వ్యక్తి కారును జీపు, బైకులతో కొంతమంది అడ్డగించారు. కారులో ఉన్న సురేష్‌ను బయటకు లాగి పిడిగుద్దులు వర్షం కురిపించి, వస్త్రాలు చింపేసి పక్కనే ఉన్న కాలువలోకి తోసేశారు.
- కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ సాక్షిగా మాజీ మంత్రి సీదిరి అనుచరులు అల్లు రమణ, మన్మధలపై టీడీపీ నాయకులు దాడి చేసి కొట్టారు.

ఇలాంటి ఘటనలు ఈ ఆరు నెలల్లో ఎన్నో..

పోలీసులకు సవాల్..



- కిన్నెర కాంప్లెక్సు సమీపంలోని ఓ వ్యాపారి ఇంట్లోకి కత్తులతో తెలంగాణకు చెందిన ముగ్గురు దొంగల ముఠా చొరబడి భారీ (కిలో బంగారం, రూ. 30 లక్షలు)దోపిడీకి స్కెచ్ వేసింది.
- అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాలుగా జిల్లా కేంద్రంలోని కొన్ని కళాశాలలు, పాడుబడిన వసతి గృహాలు మారాయి. ఈ అంశంపై ఎస్పీ గ్రీవెన్స్‌లో పేరున్న కళాశాల మహిళా ప్రిన్సిపాల్ ఫిర్యాదు చేయడం శాంతిభద్రతలకు మచ్చగానే చెప్పుకోవచ్చు.
- అమ్మాయిల వసతిగృహాల్లో, వాష్‌రూమ్‌ల్లో సీసీ కెమెరాలు పెట్టిన అంశంతో వెలుగులోకొచ్చిన ఆర్మీ కాలింగ్ నిర్వాహకుడు రమణ ఆకృత్యాలు పోలీసులకే సవాల్ విసిరినట్టుగా కన్పించింది.
- జిల్లాలో చైన్‌స్నాచింగ్‌లకైతే అడ్డూ అదుపూలేదు. ఆలయాల చోరీ, విద్యుత్తు మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ దొంగతనాలు..

ఇలా చెప్పుకుంటూపోతే బోలెడు..

హత్యలు..



- కోటబొమ్మాళి మండలం నిమ్మాడ పంచాయతీ వెంకటాపురం గ్రామదేవత ఉత్సవాల్లో టీడీపీ కార్యకర్తలు దాడికి పాల్పడగా తోట మల్లేషు అనే వ్యక్తి మరణించాడు. ఇతని కుమారుడు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఏజెంటుగా పనిచేశాడనే కక్షతో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం కాకముందే పక్కా ప్రణాళికతో ఈ దారుణానికి ఒడిగట్టారు.
- ఆగస్టు 18 అర్ధరాత్రి ఎచ్చెర్ల మండలం ఫరీదుపేటకు చెందిన వైఎస్సార్ సీపీ సాధారణ కార్యకర్త కూన ప్రసాద్‌ను దారి కాచి టీడీపీ కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆగస్టు 24న మరణించాడు.
- డిసెంబరు 6న గార మండలం శ్రీకూర్మం ఆర్టీసీ కూడలిలో ఉప్పాడ రాజేష్ అనే యువకుడిని పాత కక్షల నేపథ్యంలో కొందరు వ్యక్తులు మారణాయుధాలతో దాడిచేసి హతమార్చారు. ఇదే దాడిలో మరికొందరికి తీవ్ర గాయాలయ్యాయి.

ఇలాంటి ఉదాహరణలు ఈ ఆరునెలల్లో కోకొల్లలు.

క్లుప్తంగా

వ్యక్తిపై దాడి కేసు నమోదు

ఎచ్చెర్ల క్యాంపస్: పొన్నాడ పంచాయతీ తెప్ప రేవు గ్రామానికి చెందిన సాధు రామారావు అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాడి కేసును ఎచ్చెర్ల పోలీసులు ఆదివారం నమోదు చేశారు. ఆవులు మేపుకొని ఇంటికి వస్తుండగా, శనివారం సాయంత్రం సింహాచలం అనేవ్యక్తి తనపై రాయితో దాడి చేసినట్లు బాధితుడు ఫిర్యాదు చేశారు. గాయపడిన రామారావు శ్రీకాకుళం రూరల్ మండలం జెమ్స్ అస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆస్పత్రి వర్గాల సమాచారం మేరకు ఎచ్చెర్ల పోలీసులు ఆస్పత్రికి వెళ్లి గాయపడ్డ వ్యక్తి నుంచి ఫిర్యాదు తీసుకున్నారు.

ముగిసిన ఎస్ఎఫ్ఐ మహాసభలు



ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యవర్గాన్ని అభినందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

టెక్కలి: టెక్కలిలో జరుగుతున్న మహాసభలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులను యూటీఎఫ్ నాయకులు బాబూరావు, టి.వైకుంఠరావు, కె.దాలయ్య అభినందించారు.

ఎట్టకేలకు కేసు నమోదు

రణస్థలం: శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం కొత్తకుంకాం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త లంకలపల్లి శ్రీనువాసరావు ఇంట్లో శనివారం భారీగా మద్యం పట్టుకున్న సంగతి తెలిసిందే. అయితే కేసు నమోదు చేయకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. ఈ విషయమై 'టీడీపీ కార్యకర్త ఇంట్లో భారీగా మద్యం పట్టివేత'' అనే శీర్షికతో సాక్షిలో ఆదివారం కథనం కూడా ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు లంకలపల్లి శ్రీనువాసరావు భార్య లంకలపల్లి భవానీ వద్ద 35 మద్యం బాటిళ్ల పట్టుకున్నట్లు ఎక్సైజ్ అధికారులకు వివరాలు సమర్పించారు. ఈ మేరకు అక్రమ మద్యం కలిగినందుకు భవానీపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు రణస్థలం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ అనురాధదేవి తెలిపారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి



మృతదేహం దగ్గర విలపిస్తున్న కుమారుడు బాబీ

సారవకోట: మండలంలోని కుమ్మరిగుంట పంచాయతీ సింగంవలస గ్రామానికి చెందిన చౌదరి చంద్రయ్య (65) ఆదివారం బోడసముద్రం గ్రామంలో అనుమానాస్పదంగా మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం మధ్యాహ్నం బోడసముద్రం గ్రామంలో జరిగే ఒక ఫంక్షన్‌కు హాజరై పక్కనే ఉన్న ఖాళీ ప్రదేశంలో మృతిచెంది పడి ఉన్నాడు. గమనించిన ఆయన కుటుంబ సభ్యుడు చౌదరి రామలింగం పోలీస్ కంట్రోల్ రూంకు ఫోన్‌చేసి సమాచారం అందించారు. దీంతో స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం తరలించారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడున్నారు. భార్య నరసమ్మ నాలుగేళ్ల క్రితం సారవకోటలో పొలం పనులకు వచ్చి పాముకాటుతో మృతి చెందింది.

యమకంకరలు..!



సూదికొండలో గ్రావెల్ తవ్వకాలు చేపట్టిన ప్రదేశం

- తరిగిపోతున్న ఎర్రమట్టి కొండలు
- నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు
- రాత్రి వేళల్లో రెచ్చిపోతున్న గ్రావెల్ మాఫియా
- పట్టనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

ఇచ్ఛాపురం: ఎర్రమట్టి కనిపిస్తే అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ఎంతో చారిత్రాత్మక పేరు ప్రఖ్యాతలు కలిగిన కొండలను సైతం పిండిచేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇచ్ఛాపురం పురపాలక సంఘం పరిధి రత్తకన్న గ్రామ సమీపంలోని పీర్లకొండ, సూదికొండ ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా ఎర్రమట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. ఈ కొండల మధ్య జేసీబీ యంత్రాల సాయంతో రాత్రి వేళల్లో ఇష్టానుసారంగా తవ్వకాలు జరుపుతున్నారు. గనులు, భూగర్భ శాఖ అధికారులు, రెవెన్యు అధికారుల నుంచి ఎర్రమట్టి కొండలపై ఎటువంటి పర్యవేక్షణ లేకపోవడంతో గ్రావెల్ మాఫియా రెచ్చిపోతోంది. రాత్రివేళల్లో ఎర్రమట్టిని తరలించేందుకు వినియోగించే ట్రాక్టర్లు, లారీలు చాలా వేగంగా సమీప ప్రాంతాలైన కొండపోలమ్మకాలనీ, రత్తకన్న, డిగ్రీ కళాశాల పరిసరాల గుండా అధిక వేగంతో నడుపుతున్నారు. ఈ సమయంలో ఎటువంటి ప్రమాదాలు జరుగుతాయోనని ఆ ప్రాంతం ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.



పీర్లకొండ, సూదికొండ మధ్యలో చదునుచేయబడిన ఎర్రమట్టి దిబ్బలు

కాసులపంట

ఇటీవల కాలంలో మున్సిపాలిటీ, మండలం పరిధిలో రియల్ ఎస్టేట్ అభివృద్ధి చెందుతుండడంతో అదికాస్త గ్రావెల్ మాఫియాకు వరంగా మారి కాసులు కురిపిస్తోంది. ఇప్పటికే సూదికొండ పరిసర ప్రాంతంలో ఎర్రమట్టి దిబ్బలను తవ్వేయడంతో, సుమారుగా 3 ఎకరాల ప్రాంతం నేలమట్టంతో సమాంతరంగా చదును చేయబడింది. సూదికొండలో సుమారుగా 20 శాతం గ్రావెల్ మాఫియా చేతిలో కనుమరుగైపోయింది. ఈవిధంగా గ్రావెల్ మాఫియా చేతిలో చదును చేయబడిన ప్రాంతాన్ని కొద్దిరోజులకు అక్రమార్కులు కబ్జా చేస్తున్నారు. ఇప్పటివరకు ఈ రెండు కొండల పరిసరాల్లో దాదాపు 40 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురైనట్లు, వీటి విలువ రూ.కోట్లలో ఉంటుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇది ఇలాగే కొనసాగితే ఎంతో చరిత్ర కలిగిన పీర్లకొండ, సూదికొండ కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మా దృష్టికి రాలేదు



సూదికొండ, పీర్లకొండపై గ్రావెల్ తవ్వకాలకు ఎటువంటి అనుమతులు లేవు. ఎర్రమట్టిని ఎవరైనా అక్రమంగా నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాము. ఎర్రమట్టి అక్రమ రవాణా జరుగుతున్నట్లు రెవెన్యూ అధికారుల దృష్టికి రాలేదు. ఒక వేళ వస్తే వారిపై తక్షణమే చర్యలు తీసుకుంటాము.

– ఎస్.వెంకటరావు, తహసీల్దార్, ఇచ్ఛాపురం

సర్వం సిద్ధం..!

- నేటి నుంచి కానిస్టేబుల్ అభ్యర్థుల దేహ దారుఢ్య పరీక్షలు
- ట్రైల్ రన్ నిర్వహించిన అధికారులు
- ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ మహేశ్వరరెడ్డి



రన్నింగ్ ట్రాక్ పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో కానిస్టేబుల్ అభ్యర్థుల దేహ దారుఢ్య పరీక్షలకు సర్వం సిద్ధమైంది. సోమవారం నుంచి పోలీస్ కానిస్టేబుల్స్ దేహ దారుఢ్య పరీక్షలు నిర్వహించనున్నారు. సెలవు రోజుల్లో మినహా ఈనెల 18వ తేదీ వరకు ఈ పరీక్షలు నిర్వహిస్తారు. అభ్యర్థులు తమకు అందజేసిన కాల్ లేటర్లతో నిర్దేశించిన సమయం, రోజున హాజరు కావాల్సి ఉంటుంది. ఒరిజనల్ సర్టిఫికెట్లు, ఎటస్టెడ్ జిరాక్సు కాపీలతో హాజరవ్వాలి. విద్యార్థుల ప్రతిభ ఆధారంగా అర్హత సాధించిన వారికి ధ్రువీకరణ పత్రం అందజేస్తారు. ఎత్తు, ఛాతీ కొలత, లాంగ్ జంప్, 100, 1600 మీటర్ల రన్నింగ్ నిర్వహిస్తారు.

ట్రయల్ రన్ పరిశీలన

జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఫిజికల్ ఈవెంట్ ట్రైల్ రన్‌ను ఆదివారం పరిశీలించారు. రన్నింగ్ ట్రాక్, జంపింగ్ ట్రాక్‌లు సైతం పరిశీలించి సూచనలు చేశారు. ఏపీ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్ష ఉత్తీర్ణత సాధించిన పురుష, మహిళా అభ్యర్థులు 7,390 మంది ఈవెంట్స్‌కు హాజరు కానున్నారు. దీనికోసం పూర్తిస్థాయిలో బందోబస్తు ఏర్పాటు చేశారు. కాల్ లెటర్లు ఉన్న విద్యార్థులను మాత్రమే మైదానంలోకి అనుమతిస్తారు. రోడ్డుపై పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ బారికేడ్లు, ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేశారు. మైదానం మొత్తం సీసీ కెమెరాల నిఘాలో ఉంచారు. వైద్య సేవలు, తాగునీరు వంటివి అందుబాటులో ఉంచారు. పూర్తిస్థాయి పారదర్శకంగా రిక్రూట్‌మెంట్ ఉంటుందని, దళారుల ప్రకటనలు నమ్మవద్దని అభ్యర్థులకు సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె.వి.రమణ, డీఎస్పీలు ఎం.అప్పారావు, రాంబాబు, ఎల్.శేషాద్రి, నాగేశ్వరరెడ్డి, ఏవో గోపీనాథ్ పాల్గొన్నారు.

యాదవులను బీసీ-బీలోకి చేర్చాలి

- ఐక్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యం
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ నర్తు రామారావు డిమాండ్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): అత్యంత వెనుకడిన ఉత్తరాంధ్ర యాదవులు దుర్భరమైన జీవితాలను అనుభవిస్తున్నారని, అందువలన తమని బీసీ-డీ నుంచి బీసీ-బీలోకి చేర్చాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ, అఖిల భారతీయ యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు నర్తు రామారావు డిమాండ్ చేశారు. శ్రీకాకుళం నగరంలో ఉత్తరాంధ్ర యాదవుల ఆత్మీయ కలయిక కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాదవులంతా ఐక్యతంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం, అఖిల భారతీయ యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావులు మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో నివసిస్తున్న యాదవులకు రాజకీయంగా, ఉపాధిపరంగా ప్రాధాన్యమివ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విశాఖ సౌత్ ఎమ్మెల్యే వంశీకృష్ణయాదవ్, అహీర్ జిల్లా అధ్యక్షుడు గద్దిబోయిన కృష్ణయాదవ్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పాలిన శ్రీనివాస్, ఎంపీపీ డొక్కరి దానయ్య, ఎంపీపీ కడియాల ప్రకాష్, డాక్టర్ ఉలాల కోదండరావు, సాలిన డిల్లీ యాదవ్, కిల్లాన మాధరావు, మట్ట రవికిషోర్, నర్తు ప్రేమ్ కుమార్, మాన్యాల కృష్ణయాదవ్, నమ్మి అప్పలరాజు, గదుల సత్యలత, గద్దిబోయిన గురునాథ్ యాదవ్, ప్రసాద్‌యాదవ్, దాసరి రాజు, కాళ్ల వెంకటరావు, వంజరాపు రాజులు, కసవయ్య, పిట్ట భాగ్యచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తూర్పుకాపు ఆత్మీయ కలయిక

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలో పాత జాతీయ రహదారికి అనుకొని కేశవరెడ్డి పాఠశాల సమీపంలో తూర్పుకాపు ఆత్మీక కలయిక ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన శాసన మండలి ఫ్లోర్‌లీడర్, మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. తూర్పుకాపు సామాజిక వర్గం ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా, రాజకీయంగా ప్రగతి సాధించాలని ఆకాంక్షించారు. సామాజిక వర్గంలో పేదల ప్రగతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. తూర్పుకాపు సేవా సంఘం భవనం నిర్మాణం కోసం పల్సస్ అధినేత గేదెల శ్రీనిబాబు అందజేసిన రూ.కోటి చెక్కును ఆయన స్వీకరించారు. భవిష్యత్‌లో తూర్పుకాపు సమాజ సేవా సంఘం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు, తూర్పుకాపు సంక్షేమ సంఘం చైర్‌పర్సన్ పాలవలస యశస్వి, మాజీ ఎమ్మెల్యే మీసాల నీలకంఠం నాయుడు, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, డీసీసీబీ మాజీ చైర్మన్ డోల జగన్, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, సంక్షేమ సంఘం ప్రతినిధులు పిసిని చంద్రశేఖర్, సురంగి మోహనరావు, ఎం.రామజోగినాయుడు, కిల్లారి నారాయణరావు, పడాల తమ్మినాయుడు, లంక గాంధీ, ఇజ్జాడ శ్రీనివాసరావు, అనేపు రామకృష్ణనాయుడు, పడాల తమ్మినాయుడు తదితరులు పాల్గొన్నారు.



బొత్స సత్యనారాయణకు చెక్కు అందజేస్తున్న దృశ్యం

గౌతు లచ్చన్న విగ్రహాల శుద్ధి

- నూజివీడు ఘటనపై బీసీ నాయకుల మండిపాటు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): బీసీల ఐక్యతే లక్ష్యంగా నూజివీడులో సర్దార్ గౌతు లచ్చన్న కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారని, అయితే ఆ తర్వాత చోటుచేసుకున్న ఘటనలపై శ్రీకాకుళం జిల్లాకు చెందిన శ్రీశయన, బీసీ సంఘ నాయకులు మండిపడ్డారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని డే అండ్ నైట్ జంక్షన్‌లో ఆదివారం గౌతు లచ్చన్న విగ్రహానికి పాలాభిషేకం చేసి శుద్ధి చేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ.. నూజివీడులో సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమంలో వేరే పార్టీకి చెందిన బీసీ నాయకులు పాల్గొన్నారని బీసీ మంత్రి, బీసీ ఎమ్మెల్యేలతో మీడియా ముఖంగా క్షమాపణలు, వివరణలు చెప్పించడంతో బీసీల ఆత్మగౌరవం దెబ్బతిందన్నారు. రాష్ట్రంలో ఉన్న బీసీలంతా మనోవేదనకు గురయ్యారని వాపోయారు. బీసీలు వెనుకబడినవారే గానీ, వెన్నెముక లేని వారు కాదని స్పష్టం చేశారు. నూజివీడులో చోటు చేసుకున్న ఘటనలు పునరావృతం కాకుండా చేసేందుకే ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర శ్రీశయన కార్పొరేషన్ మాజీ చైర్మన్ డి.పి.దేవ్, జిల్లా శ్రీశయన సంఘం అధ్యక్షుడు మెండలాల్ బహదూర్ శాస్త్రి, వంగా మహేష్ దేవ్, బాణాల కృష్ణ, ఇర్రి ఆదినారాయణ, కర్రి రంగాజీ దేవ్, బంటుపల్లి కోటేశ్వరరావు, మండల మన్మథరావు, తామరాపల్లి ఉమామహేశ్వరరావు, ఇర్రి అచ్చెన్న, చిందు లక్ష్మణరావు, చింతనిప్పుల రాజేంద్ర, నాగశివ, మెండ రాంబాబు, సొంగల ఈశ్వరరావు, జిల్లా బీసీ నాయకులు అమీర్ బేగ్, శంకరరావు, గజపతి తదితరులు పాల్గొన్నారు.



గౌతు లచ్చన్న విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న బీసీ, శ్రీశయన సంఘ నాయకులు

పోలీసుల తీరు సరికాదు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సీనియర్ న్యాయవాది, గతంలో డైరెక్టర్ ఆఫ్ ప్రోసిక్యూషన్‌గా పని చేసిన జల్లా సుదర్శన్‌రెడ్డిపై పోలీసులు వ్యవహరించిన తీరు దారుణమని వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్ట దామోదర్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాయచోటి నియోజకవర్గంలోని గాలివీడు మండల కార్యాలయంలో తన తల్లి మండల అధ్యక్షులుగా ఉన్న కార్యాలయానికి వెళ్తే అక్కడ రాజకీయ కుట్రతో జరిగిన ఘటనలో వైఎస్సార్‌సీపీకి చెందిన వ్యక్తి అంటూ స్థానిక సీఐ సుదర్శన్‌రెడ్డి కాలర్ పట్టుకుని లాక్కుని వెళ్లడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. పోలీసులు వ్యవహరించిన తీరు చట్ట వ్యతిరేకంగా ఉందని, దీనిపై గవర్నర్ చొరవచూపి ఇటువంటి దాడులను నియంత్రించాలని డిమాండ్ చేశారు.



- సీఎంఆర్‌ను సందర్శించిన కేంద్ర మంత్రి

జిల్లా కేంద్రం శ్రీకాకుళంలో ఇటీవల నూతనంగా ప్రారంభించిన సీఎంఆర్ షాపింగ్ మాల్‌ను కేంద్ర పౌర విమాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం ప్రజల అభిరుచులకు తగినట్లుగా వస్త్ర, బంగారు ఆభరణాలు అందించడం సంతోషంగా ఉందన్నారు. ఇటువంటి షాపింగ్ మాల్స్ పెట్టడం వల్ల జిల్లాలో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని చెప్పారు. అనంతరం మంత్రిని సీఎంఆర్ ఫౌండర్, చైర్మన్ మావూరి వెంకటరమణ సత్కరించారు. శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

పచ్చని మొక్కలపై కక్షెందుకు బాబూ..?

- కొనసాగుతున్న అధికార పార్టీ రాజకీయ కక్ష సాధింపులు
- వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌కు చెందిన కొబ్బరి మొక్కలు జేసీబీతో తొలగింపు
- సెలవు రోజున కూడా రెవెన్యూ అధికారుల అత్యుత్సాహం

సంతబొమ్మాళి: అధికార పార్టీ రాజకీయ కక్ష సాధింపులు పరాకాష్టకు చేరుకున్నాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వైఎస్సార్‌సీపీకి చెందిన సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలపై రాజకీయ కక్షసాధింపు చర్యలకు పూనుకుంటోంది. సంతబొమ్మాళి మండలం తీర ప్రాంతమైన జగన్నాథపురం సర్పంచ్ జోగి రాములమ్మను రాజకీయంగా ఎదుర్కోలేక, ఆమె స్థిరాస్తులపై టీడీపీ నాయకులు ప్రతాపం చూపించారు. సర్పంచ్ రాములమ్మ తాతల కాలం(1972) నుంచి 315 సర్వే నంబర్‌లో 55 సెంట్లు భూమి రాములమ్మ కుటుంబీకుల ఆధీనంలో ఉంది. అప్పటి నుంచి ఆ భూమిలో వ్యవసాయం చేస్తున్నారు. వర్షాధారం కావడంతో పంటలు సరిగా పండేవి కాదు. దీంతో ఆ భూమిలో రూ.3.50 లక్షలు ఖర్చు చేసి మట్టివేసి ఎత్తు చేశారు. మూడేళ్ల క్రితం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా 180 కొబ్బరి చెట్లు నాటి పెంపకం చేపట్టారు.

కూటమి కుట్రలు

అయితే టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సర్పంచ్ రాములమ్మపై స్థానిక టీడీపీ మాజీ సర్పంచ్ పుక్కళ్ల శ్రీనివాసరావు, కొమర రామారావు, జయప్రకాష్, మైలపల్లి కాళిదాసులు కక్షసాధింపు చర్యలకు పూనుకున్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని మొదటిగా రాములమ్మకు చెందిన రొయ్యల చెరువులకు విద్యుత్ కట్ చేయించి రొయ్యల సాగు చేయకుండా అడ్డుకున్నారు. అంతటితో ఆగకుండా సర్పంచ్ ఆస్తులపై కన్నువేశారు. స్థానిక టీడీపీ నాయకులు మంత్రి అచ్చెన్నాయుడు, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు దృష్టికి తీసుకెళ్లి తమ పనిని మొదలుపెట్టారు. తాతల నుంచి రాములమ్మ ఆధీనంలో ఉన్న 55 సెంట్లు భూమిలో ఉన్న కొబ్బరి మొక్కలు తొలగించాలని రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. అధికార పార్టీ ఒత్తిడికి తలొగ్గి సెలవు రోజు ఆదివారం సైతం రెవెన్యూ అధికారులు అత్యుత్సాహంతో డ్యూటీ చేశారు. తహసీల్దార్ ఆర్.రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది పోలీసుల సాయంతో సంఘటనా స్థలానికి చేరుకుని జేసీబీతో 180 కొబ్బరి మొక్కలను సర్పంచ్ ఎదుటే తొలగించారు. టీడీపీ నాయకుడు పుక్కళ్ల శ్రీనివాసరావు తదితరులు ఫిర్యాదు చేయడం వల్లే తొలగించామని తహసీల్దార్ రమేష్‌కుమార్ తెలిపారు. సంతబొమ్మాళి ఎస్ఐ వై.సింహాచలం, ఆర్ఐ ప్రసన్న, వీఆర్వోలు కూడా పాల్గొన్నారు.

ఇంత అన్యాయమా..!



టీడీపీ నాయకులు నన్ను రాజకీయంగా ఎదుర్కొనలేక కక్షసాధింపు చర్యలకు పూనుకుంటున్నారు. మొదటిగా రొయ్యల చెరువులకు విద్యుత్ కట్ చేయించారు. ఇప్పుడు తాతల నుంచి మా అధీనంలో ఉన్న 55 సెంట్లు భూములో వేసిన 180 కొబ్బరి మొక్కలను తొలగించారు. మొన్న గ్రామస్తుల మధ్యలో నన్ను చంపుతామని టీడీపీ నాయకుడు పుక్కళ్ల శ్రీనివాసరావు బెదిరించారు. గతంలో వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు సైతం రూ.20 లక్షలు విలువ చేసే రొయ్యల షెడ్‌ను శ్రీనివాసరావు కాల్చివేశారు. ఇంత అన్యాయం ఎక్కడా ఉండదు.

– జోగి రాములమ్మ, సర్పంచ్, జగన్నాథపురం



జేసీబీతో తొలగించిన కొబ్బరి మొక్కలు

రెండోరోజు కొనసాగిన ఆవిష్కార్

టెక్కలి: సామాజిక సమస్యలకు సాంకేతిక పరిష్కారం చూపేందుకు టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ప్రారంభమైన ఆవిష్కార్ హేకతాన్ జాతీయ స్థాయి సాంకేతిక పరిశోధన కార్యక్రమం ఆదివారం కొనసాగింది. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, పశ్చిమ బెంగాల్, ఒడిశా, గుజరాత్, తమిళనాడు, తెలంగాణ, పంజాబ్, ఉత్తరాఖండ్, ఢిల్లీ తదితర రాష్ట్రాలకు చెందిన సుమారు 51 ఇంజినీరింగ్ కళాశాలల నుంచి 186 మంది విద్యార్థులు హాజరయ్యారు. వివిధ కంపెనీలకు చెందిన ప్రతినిధులు సందీప్ బత్తుల, మనోజ్‌కుమార్ బడగర్వాలా, సుష్మా బడగర్ వాలా తదితరులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తూ పరిశోధనలను పర్యవేక్షిస్తున్నారు. సోమవారంతో ఈ కార్యక్రమం ముగియనుంది.



ప్రాజెక్టులకు రూపకల్పన చేస్తున్న విద్యార్థులు

తెలుగు మాధ్యమాన్ని పునరుద్ధరించాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని పునరుద్ధరించాలని రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ(ఎస్ఎల్‌టీఏ) శ్రీకాకుళం జిల్లా శాఖ ప్రతినిధులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కేంద్రమంత్రి కె.రామ్మోహన్‌నాయుడును ఆయన క్యాంపు కార్యాలయంలో ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎల్‌టీఏ సంస్థ వార్షిక క్యాలెండర్‌ను కేంద్రమంత్రితో ఆవిష్కరింపజేశారు. ఎస్ఎల్‌టీఏ ప్రతినిధులు మాట్లాడుతూ 2019 నుంచి డీఈవో పూల్‌లో ఉంటూ అభద్రతకు, వివక్షకు గురవుతున్న భాషా పండితులకు పదోన్నతులు కల్పించాలన్నారు. అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్లకు జేఏల్స్‌గా పదోన్నతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్ఎల్‌టీఏ జిల్లాశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిసిని వసంతరావు, కూన రంగనాయకులు, రఘుపాత్రుని శ్రీనివాసరావు, గొడబ మేరీ ప్రసాద్, అరసవల్లి గణపతిరావు, బి.రామచంద్రరావు, రాడ గణపతిరావు, కుప్పన్నగారి శ్రీనివాసరావు, లోలుగు ప్రసాద్, రొంపివలస రామారావు, రుప్ప తులసీదాసు, గంద్రేటి వినయ్‌కుమార్, చాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



కేంద్రమంత్రితో క్యాలెండర్ ఆవిష్కరింపజేస్తున్న దృశ్యం

మనస్థాపంతో వ్యక్తి ఆత్మహత్య

ఎచ్చెర్ల: లావేరు మండలం రాయినింగారిపేట గ్రామానికి చెందిన జగ్గురోతు సత్యనారాయణ(30) మనస్థాపానికి గురై శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. వ్యక్తిగత కారణాల వలన తీవ్ర మనస్థాపానికి గురైన సత్యనారాయణ పొలం కోసం తీసుకొచ్చిన గడ్డి మందును తాగాడు. దీంతో అపస్మారక స్థితికి చేరుకోవడంతో ఆయనను 108 వాహనంలో చికిత్స కోసం రిమ్స్ తరలించారు. చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందాడు. అతని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ జగన్మోహనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.